మహిషాసుర మర్దిని రూపంలో అమ్మవారు





జగిత్యాలరూరల్/రాయికల్/సారంగాపూర్/పెగడపల్లి: వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని శుక్రవారం మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు.నిర్వాహకులు చండీయాగం, కుంకుమపూజలు చేశారు. జిల్లా కేంద్రంలోని దుర్గమాత మండపాల్లో శుక్రవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, పట్టణ సీఐ వేణుగోపాల్, రూరల్ సీఐ కృష్ణారెడ్డి దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ

జగిత్యాలటౌన్: పట్టణంలోని గోవింద్‌పల్లి శ్రీనవ దుర్గాదేవి మండపంలోని శుక్రవారం అమ్మవారిని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం నవ దుర్గా సేవాసమితి ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలో జీవన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి అల్పాహారం స్వీకరించారు.

బతుకమ్మ వేడుకలు



సారంగాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాలతో పాటు, నాయికపుగూడెం ,పలు గ్రామాల్లో శుక్రవారం సద్దుల బతుకమ్మ పండగ వేడుకలను మహిళలు, యువతులు, చిన్నారులు ఘనంగా నిర్వహించారు. తీరొక్క పువ్వులతో బతుకమ్మలు పేర్చి ఊరేగింపుగా వెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగు

రాయికల్: క్రీడలతో యువకుల్లో స్నేహసంబంధాలు పెంపొందుతాయని ఎస్సై సుధీర్‌రావు అన్నారు. మండలంలోని భూపతిపూర్‌లో నిర్వహించిన క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. విన్నర్‌గా ఎస్ఆర్ నైట్‌రైడర్స్, రన్నర్‌గా డ్రీమ్ చాంపియన్స్ విజేతలుగా నిలిచాయి. వీరికి ఎస్సై సుధీర్‌రావు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ ముత్యంరెడ్డి, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

సంత్‌సేవాలాల్, దుర్గా అమ్మవార్ల ప్రతిష్ఠాపన ఉత్సవాలు

సారంగాపూర్: మండలంలోని ధర్మనాయక్‌తండా బంజారా (లంబాడ) గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ సంత్‌సేవాలాల్ మహారాజ్ ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. శ్రీ సంత్‌సేవాలాల్‌తో పాటు, మేరమయాడి అమ్మవారు (దుర్గాదేవి) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు రెండు రోజుల పాటు జరగగా, శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బంజారాయూత్ సభ్యులు మాజీ సర్పంచ్ భూక్య సంతోష్ రాథోడ్, భూక్య రవినాయక్, వినోద్‌కుమార్, దుబ్బనాయక్, తిరుపతినాయక్, ప్రవీణ్‌నాయక్, మల్లేష్, తదితరులు రాజన్న పాల్గొన్నారు.

టాటా సేవలు మరువలేనివి

జగిత్యాల: ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా దేశానికి చేసిన సేవలు మరువలేనివని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. శుక్రవారం మినీ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో కోట్లాది రూపాయలు ప్రభుత్వానికి ఇచ్చి ఆదుకున్న గొప్ప వ్యక్తి అని, పద్మశ్రీ అవార్డు ఇచ్చి సత్కరించాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు గౌతమ్‌రెడ్డి, టీవీ.సూర్యం, దేవయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

మల్లాపూర్ దుర్గాదేవి ఆలయ లడ్డూ వేలం

మల్లాపూర్: మండల కేంద్రంలోని శ్రీ కనక దుర్గాదేవి ఆలయ కళ్యాణ మండపంలో శ్రీ కనక దుర్గాసేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం దుర్గాదేవి లడ్డుప్రసాదానికి వేలం నిర్వహించారు. ఈ వేలంలో గ్రామానికి చెందిన పాత్రికేయుడు తోట రాజశేఖర్ రూ.33,616లకు లడ్డు ప్రసాదాన్ని దక్కించుకున్నారు. మండలంలోని మొగిలిపేటలో భవాని దీక్షాపరులకు మహబూబ్ ఖాన్ అనే ముస్లిం నాయకుడు శుక్రవారం బిక్ష పెట్టి మతసామరస్యాన్ని చాటారు.

నర్సింహునిపేటలో హైమాస్ట్ లైట్లు ధ్వంసం

పెగడపల్లి:మండలంలోని నర్సింహునిపేటలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో గ్రామ పంచాయతీకి సుమారు రూ. 20 వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ విషయమై ఎంపీవో మహేందర్‌ను సంప్రదించగా హైమాస్ట్ లైట్ల ధ్వంసం జరిగిందని, దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

గరుడ వాహనంపై వేంకటేశ్వరుడు



ధర్మపురి: శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ధర్మపురి శ్రీలక్ష్మినృసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం గరుడ వాహనంపై శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

ఆకాశాన్నంటిన అభిమానం



వెల్గటూర్ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గండ్ర శ్రీకాంత్‌రావు, మేరుగు నరేశ్ గౌడ్.. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై ప్రత్యేక అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గంలో అడ్లూరి చిత్రంతో స్కై బెలూన్ ఆకాశంలో ఎగురవేశారు. ఈ బెలూన్‌ను పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.